నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 28 మే 2025 | HYDERABAD



వేగవంతంగా కొనసాగుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు



నగరంలో ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ చేస్తున్న దృశ్యం

# దూద్‌బావి బడికి దారి క్లియర్

## పాఠశాల హెచ్‌ఎం దీక్షతో స్పందన.. ప్రహరీని తొలగించిన హైడ్రా

**అడ్డగుట్ట, మే 27:**

చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు దారి క్లియరైంది. పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షకు అధికారులు స్పందించారు. దీంతో అడ్డు గోడను తక్షణమే తొలగించి పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని హైడ్రా అధికారులకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు మంగళవారం పాఠశాల దారికి అడ్డుగా ఉన్న గోడను తొలగించారు.

### విద్యార్థుల కోసమే దీక్ష..

పాఠశాలకు దారి లేకపోవడంతో కొంతకాలంగా విద్యార్థులు పడుతున్న బాధను చూసే సమస్య పరిష్కారానికి ఎలాగైనా ముందడుగు వేయాలన్న సంకల్పంతోనే నిరసన దీక్ష చేపట్టినట్టు హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారం కోరుతూ గతంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు, పాలకులకు పలుమార్లు వినతి పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కారానికి తాను ముందడుగు వేసి దీక్షను చేపట్టినట్లు తెలిపారు.



దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల దారికి అడ్డుగా ఉన్న గోడను కూల్చివేస్తున్న సిబ్బంది

ఆమె..నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునేవరకు నిత్యం ఇంటి పనుల్లో మునిగిపోతుంది. కుటుంబ ఆరోగ్యమే తన లక్ష్యంగా పనిచేస్తుంది. కుటుంబం బాగు కోసం తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయదు. అలాంటి మహిళ నేడు రక్తహీనత, వివిధ రకాల క్యాన్సర్ రోగాలు, థైరాయిడ్ వంటి సమస్యలతో బాధపడుతుంది. నేటికి ఎంతో మంది తల్లులు ఈ తరహా అనారోగ్య సమస్యలతో బయటికి చెప్పకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మహిళా ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది మే 28న 'ప్రపంచ మహిళల ఆరోగ్య దినోత్సవాన్ని' ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి.



# అతివలకు అండగా..

## మహిళల ఆరోగ్యానికి కేసీఆర్ పెద్దపీట


- ఆరోగ్య మహిళా కార్యక్రమానికి శ్రీకారం
- న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్ అమలు
- ప్రతి మంగళవారం ఉచితంగా పరీక్షలు

నేడు ప్రపంచ మహిళల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

**సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ):**

బీఆర్‌ఎస్ పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన కేసీఆర్ మహిళల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలైన వారికి కేసీఆర్ కిట్, తల్లిబిడ్డలను ఇంటికి క్షేమంగా చేర్చే అమ్మఒడి వాహనాలు వంటి పథకాలన్నీ కేసీఆర్ అమలు చేసినవే. మహిళల ఆరోగ్యమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ సర్కారు 2023లో ఆరోగ్య మహిళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మూత్రనాళాల ఇన్ఫెక్షన్, గర్భాశయ వ్యాధులు, లైంగిక మార్గంలో సంక్రమించే వ్యాధులు, మోనోపాజ్, థైరాయిడ్, మూడు రకాల (ఓరల్, బ్రెస్ట్, సర్వికల్)క్యాన్సర్ వ్యాధి, రక్తహీనత, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా చికిత్సనందిస్తున్నారు. రోగం ముదిరినట్లు తెలిస్తే వారిని వెంటనే గాంధీ, ఉస్మానియా, కింగ్ కోటి ఆసుపత్రులకు రిఫర్ చేస్తుండటం గమనార్హం. హైదరాబాద్‌లో నుంచి నేటివరకు వివిధ సమస్యలతో 3,32,506 మంది మహిళలు యూపీహెచ్‌సీలు, బస్తీ దావఖానల్లో చేరి పరీక్షలు చేయించుకున్నారు. జిల్లాలోని 53 యూపీహెచ్‌సీలు, 35 బస్తీ దావఖానల్లో ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా ప్రతి మంగళవారం

మిగతా IVవ పేజీలో





## వరద నీటిలో మునిగి వ్యక్తి మృతి!


దుండిగల్, మే 27: ఓ వ్యక్తి వర్షం నీటిలో మునిగి మృతి చెందిన ఘటన సూరారం కాలనీలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన పద్మారావు (40) తల్లి కృష్ణవేణితో నివాసముంటున్నాడు. మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో ఇంట్లో తన గదిలో పద్మారావు పడుకోగా ఇల్లు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో గదిలోకి వాన నీళ్లు వచ్చి చేరాయి. గమనించిన తల్లి పద్మారావును లేపేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడంతో వర్షంలోనే మునిగిపోయాడు. అంబులెన్స్ కు ఫోన్ చేయగా సిబ్బంది పరీక్షించి అప్పటికే పద్మారావు మృతి చెందినట్లు తెలిపారు. సీఐ భరత్ కుమార్ ను వివరణ కోరగా పద్మారావు నీట మునిగి మరణించినట్లు తెలిపారు.

ఉపరితల ద్రోణి, రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల మోస్తరు వాన కురిసింది. దీంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు

## మోడలింగ్ పేరుతో మోసం!

ఆన్‌లైన్ మోడల్ హంట్ అంటూ వల..

పిల్లలకు సినిమాలు, టీవీల్లో అవకాశాలంటూ గాలం..



## డిగ్రీ విద్యార్థికి 2.6 లక్షలు బురిడీ

# ఐటీ సిగలో మరో ఫ్లై ఓవర్

- ఓఆర్ఆర్ టు కొండాపూర్ వరకు
- వచ్చే నెల 2న ఫ్లై ఓవర్ ప్రారంభం

**సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ):**

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి..హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.5,937కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ 42 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ శాఖ ఐదు చోట్ల ఫ్లై ఓవర్లు చేపట్టింది. ట్రాఫిక్, వాహన రద్దీ ఉపశమనానికి ఎస్‌ఆర్‌డీపీ దోహదపడుతుంది. ప్రయాణ వేగాన్ని పెంచడం, సమయాన్ని తగ్గించడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడం, అంతేకాకుండా కనిష్ఠ భూసేకరణ నిధుల ఆధారంగా ఎస్‌ఆర్‌డీపీకి ప్రాధాన్యత ఇచ్చారు. 42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు రూ.178 కోట్ల వ్యయంతో చేపట్టిన గచ్చిబౌలి శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ అందుబాటులోకి రానున్నది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్ ఫ్లైఓవర్ వచ్చే నెల రెండో తేదీన ప్రభుత్వం ప్రారంభించేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది, ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులో 23 వ ఫ్లై ఓవర్ కావడం విశేషం. ఈ క్రమంలోనే ఫలక్‌నుమా ఆర్వోబీ, శాస్త్రీపురం ఆర్వోబీ రైల్వే పోర్షన్ రెండు, మూడు నెలలో పూర్తి చేయాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ రైల్వే అధికారులను కోరారు. వచ్చే జూలై నెల చివరి నాటి వరకు ఫలక్‌నుమా ఆర్వోబీ, ఆగస్టు నెల చివరి వరకు శాస్త్రీపురం ఆర్వోబీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

### ప్రాజెక్టు వివరాలు..

గచ్చిబౌలి శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ ను రూ.178 కోట్ల వ్యయంతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ (ఎస్‌ఆర్‌డీపీ) కింద నిర్మించారు. 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్లతో ఈ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తున్నది. దీని ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవ స్థాయి నిర్మాణం. కింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్, దానిపై శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉండగా, ఇప్పుడు దానికి పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించారు.

### ట్రాఫిక్ కష్టాలకు చెక్..

గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను ఈ ఫ్లైఓవర్ చాలా వరకు తగ్గిస్తుంది. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్ పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. ప్రయాణ సమయం ఆదాతో పాటు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ అక్కడి నుంచి కొండాపూర్ ప్రాంతాలకు వెళ్లేందుకు గచ్చిబౌలి వద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నేరుగా వెళ్లే వెసులుబాటు ఉంటుంది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఔటర్ టు కొండాపూర్ ఫ్లైఓవర్

# మళ్లీ హస్తినకు పోవలె..!

- హస్తినలోనే మకాం వేసిన మల్‌రెడ్డి
- మంత్రివర్గంలో బెర్త్ కోసం ఎక్కే గడప దిగే గడప
- అమెరికా మాజీ అధ్యక్షురాలి సిఫార్సు మొదలు రాజీనామా అస్త్రం ప్రయోగం
- మద్దతుగా నియోజకవర్గ నాయకులను ఢిల్లీకి పిలిపించుకున్న ఎమ్మెల్యే

*మంత్రి పదవి కోసం మల్‌రెడ్డి యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఈ అంశం తెరపైకి వచ్చిందే తడవుగా చలో హస్తిన అంటూ నియోజకవర్గాన్ని వదిలి వెళ్లడం రంగారెడ్డికి పరిపాటిగా మారింది. ఇందులో భాగంగా తాజాగా మరోసారి మంత్రివర్గంపై ఢిల్లీ అధిష్ఠానం కసరత్తు మొదలుపెట్టిందనే వార్త రాగానే మల్‌రెడ్డి 'మళ్లీ హస్తినకు పోయి రావలె' అన్నారు. గత ఐదారు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన ఆయన చివరకు తనకు మద్దతుగా కొందరు కీలక నియోజకవర్గ నాయకుల్ని కూడా అక్కడికి పిలిపించుకున్నారు. ఎలాగైనా రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవకాశాలు ఫిఫ్టీ.. ఫిఫ్టీ.. గానే ఉన్నాయని సీనియర్ నేతలే చెబుతుండటంతో జాబితా విడుదల తర్వాత నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుందనే చర్చ ఊపందుకుంది.*

**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/రంగారెడ్డి, మే 27 (నమస్తే తెలంగాణ):**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి పరిస్థితి ఎక్కే గడప.. దిగే గడప.. అన్నట్లుగా తయారైంది. పార్టీలో సీనియర్ అయిన తనకు ఆదిలోనే మంత్రివర్గంలో అవకాశం దొరుకుతుందని ఆశించిన ఆయనకు నిరాశే ఎదురైంది. కానీ ఇంకా నాలుగు స్థానాలు ఖాళీగా ఉండటంతో ఆది నుంచి బెర్త్ ఖరారు కోసం చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాధాన్యమైతే లేదు. కానీ



శాసనసభ స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్ ఉన్నారు. పైగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఉప ఎన్నికలో కంటోన్మెంట్ నుంచి శ్రీగణేశ్ గెలిచినప్పటికీ ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో రంగారెడ్డి జిల్లా సానుకూలతతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న నియోజకవర్గం కావడం, అంతకుమించి సీనియర్ నేత కావడం.. ఇవన్నీ వాస్తవానికి తనకు కలిసి రావాల్సి అంశాలే అనే భావన ఆయనలో ఉంది. కానీ సామాజిక సమీకరణాల్లో.. మరో కారణమో.. ఎక్కడో తేడా కొడుతుందనే అనుమానం

మిగతా IVవ పేజీలో

### ఒక్కో అస్త్రాన్ని పరీక్షించినా..!

ముఖ్యంగా గతంలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ ఉన్నపుడు కాస్త 'గట్టి'గానే ప్రయత్నాలు చేశారు. ఆమె నుంచి భరోసా రావడంతో ఇక బుగ్గకారులో తిరగడమే తరువాయి అనుకున్నారు. కానీ ప్రతిసారి మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తుంది. ఇదే క్రమంలో దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్ రావడంతో మల్‌రెడ్డి పరిస్థితి కాస్త గందరగోళంగానే మారింది. దీంతో ఆయన సన్నిహితులతో పాటు రాష్ట్ర పార్టీ పెద్దలకు సైతం తాను గతంలో చేసిన 'గట్టి' ప్రయత్నాల తీరును ఏకరువు పెట్టుకొని వాపోయినట్లు సమాచారం. అనంతరం తన ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసి చివరకు అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలహారిస్ దాకా తన పైరవీలను విస్తరించడం ఆ సందర్భంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ అటు అధిష్ఠానం... ఇటు రాష్ట్ర పెద్దల నుంచి ఎలాంటి భరోసా లభించలేదు. ఇక లాభం లేదనుకుని... కొంతకాలం కిందట బహిరంగంగానే రాజీనామా అస్త్రాన్ని సైతం ప్రయోగించారు. తన సామాజిక వర్గమే తనకు అడ్డుగా ఉంటే.. తాను రాజీనామా చేసి నియోజకవర్గం నుంచి బీసీ నేతను గెలిపించుకుంటానని కూడా వ్యాఖ్యానించి మంత్రి పదవిపై తనకున్న బలమైన ఆకాంక్షను వెల్లడించారు. ఇంతచేసినా.. ఎటు నుంచి కూడా ఆయనకు భరోసా దొరకడం లేదని పార్టీవర్గాలే చెబుతున్నాయి. ఇక.. పొరుగు నల్లగొండ జిల్లా రాజకీయాల్ని సైతం తనకు అనుకూలంగా మలుచుకునేందుకు మల్‌రెడ్డి తెర వెనక పావులు కదిపారనే వ్యాఖ్యలు పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే సీనియర్ నేత జానారెడ్డి ఏకంగా పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖ కూడా సంచలనమైంది. రాష్ట్రంలో కీలకమైన రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని జానారెడ్డి తన లేఖలో అధిష్ఠానానికి సూచించడం మల్‌రెడ్డి ఆశలకు రెక్కలు తొడిగినట్లయింది.